"నీకోడలిపాతివ్రత్యము నాకిరీటముకంటె గొప్పది"

అవి జహంగీరు పాదుషా రాజ్యం చేస్తున్న రోజులు. ఢిల్లీనగరమునకు చివర కార్మికులు నివసించే మజదూర్ పేటలో ముస్లిం యువకుడు కాశీము, అతని భార్య, అతని తల్లి నివసిస్తూ ఉన్నారు. రెక్కలాడితే గాని డొక్కలాడని నిరుపేద సంసారం అతనిది. పగలంతా కూలీనాలీచేసి సంపాదించిన కొద్దిపాటి డబ్బులతోనే వారు ముగ్గురు బ్రతకాలె. అతని తల్లి ముసలిది పనికికాదు. అతని భార్య యెలప్రాయపు జవ్వని ఎక్కడికిపోదు. కనుక అతని ఒక్క సంపాదనేవారికి ఆధారం. పూటబత్తెం పుల్లవెలుగుగా గడిపేసంసారమైనప్పటికి ఆ యువదంపతుల అన్యోన్యం ఇంతా అంతాకాదు. కాశీం యింట ఉన్నంతసేపు సతీపతులిరువురు చిలకా గోరువంకల్లాగ కూడ కూడ ఉంటూ ముసిముసినవ్వులు నవ్వుకుంటూ, ముచ్చట్లాడుకుంటూ ఎంతో ప్రేమగా ఉంటారు. ఫాతిమా అతిలోక సౌందర్యవతి. అతిలోక గుణవతికూడా. భర్తను ఎంతో ప్రేమగా చూస్తుంది. ఆమె చేతులనున్నవి వెండికడియాలు. చెవులనున్నవి యిత్తడిపోగులు, కట్టుకున్నది చిఱుగులబట్ట. అయినా ఆమెకు భర్తయందు అసంతృప్తిలేదు. అష్టోపభోగములు అనుభవించేవారిని చూచి అవి నాకు లేవన్నచింతలేదు. సుఖమునకు కావాచి భాగ్యభోగ్యాలు కావు. తృప్తి. ఆ తృప్తితో ఆమెసమస్త సౌఖ్యాలు అనుభవిస్తున్నట్టుగానే భావిస్తున్నది. కూలికి పోయిన పెనిమిటి కొంచెం రావడం ఆలస్యమైతే ఆమె అతను వచ్చేబాటమీదనే చూపులుపెట్టుకొని కూర్చుంటుంది. కాశీంగూడా తన పని అయితేక్షణం ఆలస్యం చేయకుండా ఇంటికి ఉరుకులుపెట్టుకుంటూ వస్తాడు. ఆ కొడుకూ కోడలు ముచ్చటలు చూచి తనంత అదృష్టవంతురాలు లేదని ఆముసలిది మురిసిపోతుంటుంది.

౨

ఢిల్లీనగర కొత్వాలు సాదుల్లా. ప్రజలు చేసే సమస్త నేరములు విచారించి శిక్షించే అధికారి అతను. ఉద్యోగ రీత్యా న్యాయాధిపతి అయినను వానివద్ద రవ్వంత న్యాయములేదు. స్వభావముచేత మనిషి అతి కఠినుడు, క్రూరుడు, పాపభీతి లేనివాడు, త్రాగుబోతు, స్త్రీ లోలుడు. చక్కని పిల్ల వాని కంటబడినదా పరువుదక్కదు. తక్షణం వాడి జనానాకు చేర్చబడవలసిందే. దుష్టుడైన అధికారికి దుష్టులైన అనుచరులు ఉండటం సహజం. గూఢచారి దళం వాని అనుచరులు యెక్కడెక్కడ చక్కని యువతులున్నారో వారిని వెదకి వెదకి తమ అధికారికి నివేదించడం వాళ్ళవృత్తి. ఒకనాడు కాశీం భార్య ఫాతిమా వాని అనుచరుల్లో ఒకని కంటబడింది. ఆ సౌందర్యవతిని చూచి ముగ్ధుడై అధికారికి ఆమె ఉనికి చెప్పి వాని అనుగ్రహమునకు పాత్రుడైనాడా నీచుడు. నాటినుండి ఆమెను పట్టుటకు వేట ఆరంభమైంది. ఇరువదేండ్లు నిండీనిండని ఆయె లప్రాయపు జవ్వనిని కొత్వాలు సాహెబావారికి సమర్పించినచో ఆయన కోరినంత ధనమీయగలడనీ, మీ దారిద్ర్యం వదిలిపోతుందనీ, సుఖంగా జీవించవచ్చుననీ, రాయబారులు మొదలు పెట్టారు. సౌమ్యంగా ఒప్పుకుంటే ధనమైనా దక్కుతుంది లేకపోతే ధనమూ భార్యా గూడా దక్కడం వట్టిదని బెదరించడం మొదలుపెట్టారు. ఫాతిమా ఛీ ! వాని ముఖం చూడనని ఛీత్కరించింది. వాడి ధనమెవడికి కావలెనా కాయకష్టమే నాకు చాలునని కాశీం తిరస్కరించాడు. మీ భోగభాగ్యాలతో మాకేం పని మా కొడుకు కోడలు సుఖంగా ఉంటే అంతేచాలును. మీ ముఖము మండ ! ఎక్కడ దాపురించినారని ముసలిది తిట్టిపోసింది. నాటినుండి వారి సుఖ సంసారము ఏదో ఒక మహా అగాధంలో పడినట్లయింది. ఆ ముచ్చట్లు మురిపాలు లేవు. ఆ చిఱునవ్వువెన్నెలలు లేవు. అన్నం నీరు ముట్టక ఫాతిమా ఒకటే యేడుపు. ఈ భార్యను ఈ నరరూప రాక్షసుని బారినుండి ఎట్లా రక్షించుకోగలనని కాశీంకు ఒకటే వేదన. అయ్యో ! ఈ కొడుకు కోడలు యీ ఆపదనుండి ఎట్లా బయట పడతారని ముసలిదానికి ఒకే ఆరాటం. కాశీం ఎన్ని విధాల బుజ్జగించినా ఫాతిమాకు శాంతిలేదు. అతని ఒడిలో తలదూర్చి ఒకటే విధంగా ఏడుస్తుంది. ఆ భార్య

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

దుఃఖం చూడలేడు కాశీం కాని ఏంజేస్తాడు ? కొత్వాలు సాహేబును ఎదిరించే తాహతు ఆ పేద కూలీకి యెక్కడిది ? ఎప్పుడు కొత్వాలు నౌకర్లువచ్చి తన భార్యను బలవంతంగా లాక్కొని పోయి కొత్వాలుకు ఒప్పగిస్తారో నని అడిలిపోతూ క్షణం ఒక యుగంగా గడుపుతున్నాడు కాశీం. ఒకనాడు కాశీం ఏ కూలీకో పోయినాడు. ముసలిది బజారుకు పోయింది. సాదుల్లా నౌకరొకడు సంచి నిండా మొహరీలు పోసుకువచ్చి, ఫాతిమాకు చూపిస్తూ ఇవిగో బంగారు మొహరీలు ; నీ జన్మలో చూచి యెరగపు. ఈ మజదూర్ ముండాకొడుకును అంటిపెట్టుకొని ఉంటే ఏమి సుఖపడతావు. కొత్వాలు సాహేబు వద్దకు వస్తే మహరాణీలాగా సుఖిస్తావు రమ్మన్నాడు. ఛీ ! అషర్ఫీ లెవ్వడికి కావాలె. నా పెనిమిటితో పేదటికం మీ కొత్వాలు భాగ్యంకంటే నాకు గొప్పదే. మీ కొత్వాలు తుచ్ఛుడు నీచుడు, కనపడ్డ స్త్రీనల్లా చెఱపట్టే దుర్మార్గుడు నా భర్త యోగ్యతముందు వాడి అధికారము, ఐశ్వర్యము గడ్డిపోచతో సమమని ఫాతిమా తిరస్కరించింది. ఇంతలో ఫాతిమా అత్తవచ్చి మొహరీల సంచి యెత్తి వీధిలో పడవేసి నీచుడా ! నీకు ఆడతోడు లేదా నా కోడలు వెంబడి పడ్డావని తిట్టి వెళ్ళగొట్టింది. "ఎన్ని విధాల చెప్పినా వినకుండా తిరస్కరిస్తున్నావు. కొత్వాలుతో విరోధం పులితో చెలగాటం. రాత్రి తొలిజాము వెళ్లే లోపల కొత్వాలు సాహేబు స్వయంగా వచ్చి నీ కోడలిని తీసుకపోడానికి నిశ్చయింపుకున్నాడు. ఇక యెవ్వరడ్డు పడుతారో చూస్తాము"ని ఆ నౌకరువాడు అరుచుకుంటూ వెళ్ళిపోయినాడు. ఇంతలో కాశీం ఇంటికి వచ్చాడు, జరిగిన సంగతి తల్లి, భార్య, చెప్పారు. ఆరోజుతో తమ దాంపత్య జీవితానికి అంతిమ ఘడియలు వచ్చినట్లేనని నిశ్చయించుకున్నారు, ప్రొద్దు క్రుంకే లోపల ఢిల్లీనగరం వదిలి పారిపోతే బాగుండుననుకున్నారు. కాని చేతిలో చిన్న కానీలేదు, బండ్లు వాహనాలు యెక్కి పోలేరు. నడిచిపోతే సాదుల్లా నౌకర్ల కంటబడకుండా పోవడం కష్టం. వారిలో ఏఒక్కడు చూచినా కాశీమును, అతని తల్లిని తుదముట్టించడము, అతని భార్యను సాదుల్లా జనానాకు చేర్చడము క్షణంలో జరిగిపోతుంది. ఇది కాదు మార్గమని ముసిలిది కాశీంను కోడలికి కాపలాపెట్టి తమ కులపెద్దగా ఉన్నవానివద్దకు పోయి మొరపెట్టుకున్నది. అతను సాదుల్లాను ఎదిరించడం ఎవరికి చేతగాదు. నీకు న్యాయం కలిగితే పాదుషావారివల్లే కలగాలె. నీవు కోట వద్దకు పోయి అచట కట్టిఉన్న గంటను మ్రోగించు, నీ మొఱను ఆలకించే ప్రభువు కనిపిస్తాడని చెప్పాడు. సరే ఆ కోటవాకిటకు పోయి మొరపెట్టుకుందామని ముసలిది నిశ్చయించింది.

మజుదూర్ పేటకు పాదుషావారి కోట ఎంతోదూరం అయినప్పటికీ అన్నం నీళ్ళులేని ఆ ముసలివగ్గు దారిపట్టి అట్లాగే పోవడం మొదలుపెట్టింది.—

3

మొగలాయి ప్రభువులలో న్యాయతత్పరత యందు అగ్రగణ్యుడని పేరుగాంచిన జహంగీరు పాదుషా ప్రియురాలైన నూర్జహానుతో ఉల్లాసంగా ముచ్చట్లాడుతున్నాడు. అంతలో ప్రజల విన్నపముల నాలకించే నిమిత్తం కోటవాకిట గట్టించిన గంట గణగణా మ్రోగింది. న్యాయ ప్రియుడైన పాదుషా ప్రియురాలితో ముచ్చట్లు కట్టిపెట్టి చరచరా నడచి కోట వాకిట వచ్చి నిలిచాడు. గంట వద్ద ఒక ముసలిది నిలిచి పాదుషా వారిని చూచి సలాం చేసింది. పాదుషా ఆమెను చూచి ఏమిటి నీ ఆర్తి అన్నాడు. న్యాయప్రభువులైన పాదుషావారి రాజ్యంలో గూడ మావంటి పేద ప్రజల కష్టాలకు నివారణ కనిపించడం లేదుగదా అన్నది. ఏమిటి నీ కష్ట మన్నాడు ప్రభువు.

స్త్రీల మానమర్యాదలకే భంగం వస్తున్నది. అంత కంటె కష్టమేమి కావలెనన్నది ముసలిది.

"భంగపాటా" అన్నాడు ప్రభువు.

అయ్యా ! ప్రభువులు రక్షించకపోతే మావంటి పేద వాళ్ళు మనగలరా ? అన్నది ముసలిది.

అవునమ్మా సంగతేమిటో చెప్పరాదా అన్నాడు ప్రభువు.

పాదుషావారు ప్రజల మొరలనాలకించి వారి కష్టముల నివారించగలరని కోట వాకిట గంట కట్టించారు. గంట గంటగానే ఉన్నది. జరుగవలసిన అన్యాయాలు జరుగుతున్నవన్నది ముసలిది.

ఏమి అన్యాయమో చెప్పవేం అన్నాడు ప్రభువు విసుగ్గా.

'అయ్యా ! నా కొక్కగా నొక్క కొడుకు.'

'సరే'

'నా కోడలు చక్కని చుక్క.'

'ఊఁ'

'మహా యిల్లాలు.'

'అదృష్టవంతురాలవు.'

'ఏమి అదృష్టవంతురాలను ? ఆమెను రంక్షించుకో లేక అల్లాడుతున్నాను. ఈ ఒక్క రోజు ఆమెను రక్షిస్తే చాలు. సాయంత్రం లోపల ఆమె వెండికడియాలమ్మి దారి బత్తెమునకు నాల్గు డబ్బులు చెంగున గట్టుకొని తెల్ల వారగట్లనే ఏవూరో లేచిపోతాము. అయ్యా ! ఈ ఒక్క రాత్రి నా కోడలు ఆ దుర్మార్గుడి బారి పడకుండా రక్షిస్తే చాలు. తెల్లవారితే ఈ అధర్మ నగరంలో మేము ఉండమని ముసలిది వలవలా ఏడ్చింది.

"ఎవరమ్మా ఆ దుర్మార్గుడు" అన్నాడు ప్రభువు.

'సాదుల్లా'

ఎవడు ? కొత్వాలు సాదుల్లాయేనా ?

అవును. ఈసాయంత్రంలోపల నా కోడలిని వాడింటికి చేర్చకపోతే రాత్రి ఝాము పొద్దుపోయన తర్వాత వాడే స్వయంగా వచ్చి బలాత్కారంగా నా కోడలిని తీసుకపోతాడుట. అయ్యో ! నా బిడ్డ అన్నం నీళ్ళు గానకుండా అల్లాడిపోతున్నది. నా కొడుకు పిచ్చివాడులా అయిపోయినాడు. పండువంటి నా బిడ్డ కాపురం గంగలో కలిసిపోతున్నది అని ముసల్ది మఱింత బిగ్గరగా ఏడ్చింది.

"పాదుషా ఉశ్ ఏడువబోకని వారించి ఊరిక బెదరించడానికన్నాడేమో ఇష్టం లేనిది నీ కోడలి నెందుకు తీసుకపోతాడులే అన్నాడు.

అయ్యా ! తీసుకపోకేమి ఎట్లాగైనా దాన్ని తీసుకపోవాలెననేగా మొహరీలు సంచీలో పోసి యింటికి పంపించాడు. వాడి మొహరీలు యెవరిక్కావలి. విసరి వీధిలో పారవేశాం. డబ్బు కొఱకు శీలం పోగొట్టుకొనే నీచులం కాము మేము. నా కోడలు మానావతి. వాడిబారి పడకుండా ప్రాణత్యాగం చేసుకుంటానంటున్నది. నా కొక్కగా నొక్క కొడుకు. వాడికి భార్యమీద పంచప్రాణాలూను. అటువంటి భార్యపోతే నా బిడ్డ బ్రతుకుతాడా ! ముసలిది మళ్ళీ హృదయం ద్రవించేటట్లు ఏడ్చింది. పాదుషాకు గూడా పట్టరాని దుఃఖం వచ్చింది. కన్నులనిండా వచ్చిన కన్నీళ్ళను చేతి రుమాలుతో తుడుచుకున్నాడు. ప్రజల అపరాధాలు విచారించి శిక్ష విధించే కొత్వాలే ఇంత దురాగతానికి ఒడిగట్టడమా. ప్రజల కష్టములను విచారించి వారి ఆర్తిని నివారించడంలో అగ్రగణ్యుడని కీర్తిగన్న తన ప్రభుత్వంలోనే తన ఉద్యోగులే ఇంత దుర్మార్గానికి ఒడిగట్టడమా. ఒక మహాసాధ్వి కష్టం నివారించలేని తన చక్రవర్తిత్వం ఉండియేమి లేకయేమి ? అన్న భావాలెన్నో పాదుషా హృదయంలో మెదలిపోయినాయి. ఆలోచనా ధీనచేతస్కుడై పాదుషా అట్లే నిలబడిపోయినాడు. మహా కష్టంతో తల్లడిల్లిపోతున్న ఆ ముసలిదాని మనస్సు చల్లపడేటట్టుగా ఒక్క మాట పలకడానికైనా ఆయనకు చేతగాలేదు. ఆయన అట్లా నిలబడి ఉండగానే పేదవాళ్ళ మొర దేవుడే వినడు. మానవుల చెవికా యెక్కేది ? ఇటువంటివాళ్ళు ప్రజలగోడు వింటామని గంట కట్టడం గూడా డంబమే అంటూ విసురుగా ముసలిది వెళ్ళిపోవడం మొదలుపెట్టింది. అప్పుడు పాదుషా తన యోచనా సమాదినుండి మేలుకొన్నట్లయి అవ్వా ! మీ యిల్లెక్కడ అన్నాడు. నగరి చివరను ఉన్న మజదూర్ పేటలో అంటూ ముసలిది వెళ్ళిపోయింది. పాదుషా గూడా దీర్ఘంగా ఒక్క నిట్టూర్పు విడిచి నగరిలోకి వెళ్ళిపోయినాడు.

౪

రాత్రి తొమ్మిది గంటలు దాటింది. పగలంతా కష్టించి వచ్చిన మజదూరుపేటలోని పాటకపుజనం తిండీతిప్పలు తిని ఎక్కడివాళ్ళక్కడ పడిఉన్నారు. కాశీము, అతని భార్య. అతని ముసలి తల్లి. పాదుషావారికి స్వయంగా చెప్పుకున్నా ఆయన తమ్ము రక్షిస్తానన్న అభయవాక్యం మాటవరుసకైనా పలుకనందున తమరిక సర్వనాశంకాక తప్పదన్న నిస్పృహతో చీమచిటుక్కుమన్న సాదుల్లా వచ్చాడన్నభీతావహంతో ఆహారనిద్రలు మాని గడగడలాడుతూ తలుపులు మూసుకు కూర్చున్నారు. ఇంతలో టకటక గుఱ్ఱం వచ్చినచప్పుడు, ఆ గుఱ్ఱముమీదినుంచి మనిషి దిగినచప్పుడు, ఆ మనిషి దబదబ వచ్చి తలుపు తట్టినచప్పుడు ఒకదాని వెంట ఒకటి వినవచ్చినాయి. ఆచప్పుడు వినవచ్చినకొలది లోపల ఉన్న ముగ్గురు ఒకరి దగ్గరకొాకరు చేరుకొని నాటితో తమ బ్రతుకులు ఆఖరైనట్లేనని తల్లడిల్లడం మొదలుపెట్టారు. ఎవరు లోపల తలుపు తీయండన్న కేక మళ్ళీ కర్ణకఠోరంగా వినిపించింది. ఆ కేకలకు దద్దరిల్లి తలుపువేసుకొని లాభంలేదని

మునలిది ఏడుస్తూవచ్చి తలుపుతీసింది. ఆ మునలిదాన్ని
చూచి బాగా కైపులో ఉన్న సాదుల్లా మునలిముండా
తలుపుతీయమంటే తీయక బుడిబుడి ఏడ్పులు ఏడుస్తావా
అని ఫెడీలుమని ఒకచెంప పెట్టుపెట్టి అవతలికి పడద్రోసి
కాశీం దగ్గరకుపోయి బ్రూతికాలుతో వానివి నాల్గుతన్ని
త్రోసివేసి ఫాతిమాను పట్టబోయినాడు. ఫాతిమా వాడిని
చూచి పెద్దగా ఏడ్వటం మొదలుపెట్టింది. ఇంతలో
మొండితెగువ చేసుకొని కాశీం భార్యకు అడ్డం పోయి
నాడు. కాశీంపై దెబ్బలు వర్షంకురిసినట్లు పడుతున్నాయి.
ఏమైనా కాశీం భార్యపై చేయిపడనీయడు. ఫాతిమా మగ
నిని పెనవైచుకొని వదలదు. లోపల సాదుల్లా చేస్తున్న
బీభత్సం ఇరుగుపొరుగులవారికి వినవస్తునే ఉన్నది.
కాని కొత్వాలు సాహేబును ఎదిరించే సాహసం ఆపేద
జనానికెక్కడిది? కాదంటే రేపు తమ యింటిమీదయిదే
జులుం సాగిస్తాడనే భయంగదా. ఎవరుకిక్కురుమనలేదు.
లోపల ఆ క్రందనాలు, అరుపులు, వినవస్తున్నాయి. బైట
సాదుల్లా గుఱ్ఱపువాడు గుఱ్ఱమును పట్టుకొని నిల్చిఉన్నాడు.
ఇంతలో ఎవరో అజ్ఞాతవ్యక్తి త్వరత్వరగా వచ్చి యింటి
చుట్టు తిరగడం మొదలుపెట్టాడు. గుఱ్ఱపువాడు వానిని
చూచి "ఎవడవోయి నీవు ఇట్లా వచ్చావు. లోపల
ఎవరున్నారో తెలుసునా? కొత్వాలు సాహేబు! లోపలికి
పోతివా ప్రాణాలు దక్కవు వెంటనే వెళ్ళిపో" అన్నాడు.
ఆ అజ్ఞాత వ్యక్తి మారుమాట్లాడకుండా వానిచెంపపై
ఒక్క పెట్టుపెట్టి గుఱ్ఱమును చూరుదగ్గిరకులాక్కొని దాని
జీనులాడాలమీదుగా ఇంటికప్పుపైకెక్కి ఆకులూడి
పోయిన ఆకప్పుకంతలలోగుండా కాశీమును ఒక చేతితో
నెట్టివేస్తూ, ఫాతిమాను గట్టిగా చేయిబట్టిలాగుతున్న
సాదుల్లా యెట్టయెదుటకు అరే! సాదుల్లా ఎంతపని
చేస్తున్నావు దుర్మార్గుడా అంటూ ఒక్క దుముకు దుమి
కాడు. పాదుషా కేక పెట్టుతూ ఎదుట ప్రత్యక్షం కావడం
సాదుల్లాకు ఉఱుము ఉఱిమి పిడుగు పడ్డట్టైంది. మనిషి
చేతులు కాళ్ళు పట్టుతప్పిపోయి నిలువునా నేల పడిపోయి
నాడు. నోరు మూసుకుపోయింది. కళ్ళు తేలవేశాడు.
ప్రాణం మాత్రమే గుండెల్లో కొట్టుకుంటున్నది. పాదుషా
పండ్లుపటపట కొఱుకుచు కాలితో వానిని తట్టి పదఅన్నాడు.
సాదుల్లా లేని బలంతెచ్చుకొని లేచి గడగడ లాడుతూ
పాదుషా వెనుక నిలబడ్డాడు. పాదుషా వానిని 'రా' అని
బయటికి లాక్కొని పోయి పొడుగాటిత్రాడు వాని నడు
ముకు కట్టి ఆత్రాడును గుఱ్ఱపు వెనుకకాలికి కట్టి గుఱ్ఱము
పై తానధిరోహించి చళ్‌మని కొఱడాతో గుఱ్ఱాన్ని అద
లించాడు. గుఱ్ఱముపై స్వారిచేయుచు పాదుషా, ఆ గుఱ్ఱ
ముకాలికి బంధితుడై పరుగెత్తుచు సాదుల్లా. క్షణంలో
గుఱ్ఱము దృష్టి పథందాటి పోయింది.

౫

తెల్లవారి జాము ప్రొద్దెక్కింది. న్యాయ ప్రభువైన
జహంగీరు చక్రవర్తి అత్యవసరంగా కొలువు తీర్చినాడు.
మంత్రులు, సామంతులు, సేనాధి పతులు, ఇతర రాజో
ద్యోగులు, రక్షకభటులు ఇతర పరివారజనులు ఎవరి స్థాన
ములవారు ఉండి పాదుషా ఆజ్ఞల కెదురు చూచుచున్నారు.
పాదుషా సింహాసనాధిష్టితుడైనాడు, అత్యవసరంగా రాజ
సభ ఎందుకేర్పరచ బడినదో ఎవరికీ తెలియదు. చక్రవర్తి
ప్రసన్నడుగాలేడు. రాత్రి గాంచిన బీభత్స భయానక
దృశ్యము మనస్సు నెమరు వేస్తున్నది కాబోలు. ముఖం
జేవురించి ఉన్నది కన్నులు రోష కషాయితమై భయం
కర పరిణామాన్ని సూచిస్తున్నవి. అప్రసన్నుడైన
ప్రభువు ముఖారవిందం చూచి ఎల్లరు ఎవరికేమి కీడు
మూడనున్నదోనని భయవిహ్వలులై శంకిస్తున్నారు.
ఇంతలో చక్రవర్తి ఒకమారు సభ కలయచూచి రక్షక
భటాధ్యక్షునితో నేరస్థుని హాజరు పెట్టించుము అని ఆజ్ఞా
పించినాడు ఈలోగ ప్రభువు ఉత్తరువుచేకాబోలు ఫాతిమా
అత్త మునలిది సగౌరవముగా లోనికి తోడ్కొని రాబడి
ఉచితాసనమున కూర్చుండపెట్టబడినది. ఈ రెండు విష
యములు వినగా కనగా ఆ నేరస్థుడెవరు? ఈ మునలి
దెవరు? అని అందఱు ఆశ్చర్యచకితులై ఆందోళన
చిత్తంతో దిక్కులు చూస్తున్నారు. ఇంతలో గుఱ్ఱము వెంట
పరువెత్తుటచే ఒడలినిండ రక్తసిక్తమైన గాయములతో
శృంఖలా బద్ధమైన చేతులతో, అశ్రుసిక్తమైన నేత్రములతో
అవనతమస్తకుడైన సాదుల్లా చక్రవర్తి సమ్ముఖమునకు
కొనిరాబడినాడు. ఏమి! నిత్యము శతాపరాధులకు శిక్ష
విధించే కొత్వాలు సాహేబు అపరాధియా! కొలువెల్ల
ఒక్కమారు భ్రాంతచేతస్కమైపోయింది. దిగ్భ్రమతో
మిఱ్ఱిమిఱ్ఱిచూచేవాళ్ళు, భయంతో వడవడ వడికేవాళ్ళు,
దుఃఖంతో కంటతడి పెట్టేవాళ్లు. శంకతో ఇతడు చేసిన
అపరాధమేమై ఉంటుందని వితర్కించేవాళ్లు, ప్రభువుల
కాగ్రహం వస్తే ఎవరి బ్రతుకైనా యింతేనని చింతించే
వాళ్ళు ఆయి సభంతా లోపల నక్రగ్రాహ పాఠీనాది భీకర
జలజంతు సంతానయుతమై క్షోభిల్లుతూ ఉండి పైకి నిస్త

రంగ జలధిలాగా మౌనముద్ర వహించి గంభీరంగా ఉన్నది. కొలది నిముషాలు గడిచాయి. ఎల్లరు చక్రవర్తి దెస కేంద్రీకృత దృక్కులై ఉన్నారు. అంతలో మేఘగంభీర నిస్వనంతో సభోప విష్టులైన ప్రజలనుద్దేశించి పాదుషా ఇట్లనినాడు. "ఈ కొత్వాలు సాదుల్లా నిరుపేద అయిన ఒక మానవతిని చెఱపట్టుటకై చేయుచున్న ప్రబల బలాత్కార దౌర్జన్యమును రాత్రి నేను కండ్లారా చూచి చేతులారా యితనిని బందీకృతుని చేసి గుఱ్ఱపు కాలికి కట్టివేసి లాక్కొని వచ్చాను. కనుక దీనికి ప్రత్యేక విచారణా తీర్పు అనవసరము. ప్రజల కష్టములను స్వయంగా విని ఆపదలను నివారించుటకై కోటవాకిట గంట కట్టించిన నాకు, నా ప్రభుత్వములో ప్రజల నేరములను విచారించి శిక్ష విధించవలసిన నా ప్రభుత్వోద్యోగియే ఒక స్త్రీ యెడ ఇంత దౌర్జన్యము జరపడం కంటె గర్హితమైన విషయము నాకు అవమానకరమైన విషయము వేరొకటి లేదు. ఇంత దుశ్శీలురు రాజోద్యోగులుగా ఉంటే ప్రజల ప్రాణ మాన ధనంబులకు రక్షణమెక్కడ? పతిప్రాణలైన పరమ సాధ్వీమతల్లులు నా పరిపాలనలో ఎట్లు సురక్షితంగా ఉండగలరు? నా రాజరికానికి గౌరవమేమున్నది? పరమ సాధ్వీమ తల్లులైన స్త్రీలను చెఱబట్టే ఈ నీచ సాదుల్లాకు మరణ శిక్షే అర్హమైంది. కాని వీడు చిర కాలము బ్రతికి స్త్రీల యెడ తాను చేసిన అపరాధాన్ని తలచి తలచి యేడవటమే మరణశిక్షకంటె బలీయమైన శిక్ష కాగలదు కాబట్టి వీనికి యావజ్జీవ కారాగృహ శిక్ష విధిస్తున్నాను" అన్నాడు పాదుషా. సాదుల్లా చేసిన మహాపరాధమూ వానికి విధింపబడిన దారుణ శిక్షా. ఒక్కమాటుగా విని ప్రజలు నిర్విణ్ణులై అనిమిషనయనులై చూస్తూ ఉండగా తక్షణమే పాదుషా సింహాసనం నుండిదిగి ఫాతిమా అత్త అయిన ముసలిదానివద్దకు వచ్చి దగద్గద్గయితమైన తన నవరత్న ఖచిత కిరీటమును శిరమునుండి తీసి ముసలిదాని పాదములపైనిడి "తల్లీ! నీ కోడలి పాతివ్రత్యము నా కిరీటముకంటె గొప్పది" అని వినమ్రుడై మోకరిల్లినాడు.